# అనగల రాగం



విని వూరుకున్నాను.

అదే ప్రశ్నని రెండోసారి కొంచెం మార్చి అడిగినప్పుడు అసహనంగా అక్కడినుంచి కదిలాను.

వెన్నెల విశాలంగా పరచుకుంది మేడమీద. కుక్కలు వుండివుండి అరుస్తున్నాయి. దూరంగా కొరివి దెయ్యాల్లా మినుకుమినుకు మంటున్నాయి బతకమ్మకుంట గుడిసెల్లోంచి గుడ్డిదీపాలు.

రవీంద్ర దగ్గరనుంచి వచ్చానేకానీ, అతని ప్రశ్న నన్ను వెంటాడుతూనే వుంది. నిజానికది ప్రశ్న అయితే కేవలం అవుననో కాదనో చెప్పగలం, కానీ, అదికాదు అతనికి కావల్సింది, అది నాకూతెలుసు, అతనికి నచ్చేలా జవాబివ్వాలంటే ఎన్నో వదులుకోవాలి, మరెన్నో విషయాలకు సర్దుబాటు చేసుకోవాల్సి వుంటుంది. అది రవీంద్రక్కూడా తెలుసు, కాదనను. అది కేవలం నాకు సంబంధించిన విషయమేకాదు. యిందులో మూడు జీవితాల భవితవ్యం నిండివుంది, పైగా మానవతా దృక్పథంతో చూసినా. ఈ విషయంలో మిగతా కష్టనష్టాలను అనాయాసంగా అధిగమించవచ్చు.

చాలాసేపటి తర్వాత వెనగ్గా పొడిదగ్గు వినపడింది. టైంచూశాను. పదిన్నర దాటింది. నా సమాధానం కోసమన్నట్లుగా వచ్చి నా పక్కగా ఆగింది. కింద వాటాల్లోంచి రేడియోలో అనుకుంటా వీణ వినవస్తోంది.

"అలాగే వస్తాను, కానీ, ఆశలు పెంచొద్దు... అలాని నువ్వుకూడా..." దీర్ఘంగా నిశ్వసిస్తూ అన్నాను.

అలా మాట యిచ్చానేగానీ యింకా ఎటూ నిర్ణయించుకోలేనితనం, నాకంటూ వ్యక్తిగతంగా ఎటువంటి వ్యతిరేకతా లేదు. కానీ, కాలం మాత్రం మన ప్రమేయం లేకుండా ముందుకు సాగిపోతోంది. నిర్జీవంగా, నిర్లిప్తంగా తన ప్రభావాన్ని శరీరాల మీద చూపిస్తూ.

"నిజమే! మనం నిమిత్త మాత్రులమే అయితే, మన ఉనికి మరొకరికి 'ఊతం' అయితే ఒక ఆలంబన కాగలిగితే... అప్పుడు మన బతుక్కొక అర్థం, పరమార్థం ఏర్పడుతుంది కూడా కదా చూడండి..." సరిగ్గా వారం అయిందనుకుంటా, మా ఇంటి యజమాని, సరిగ్గా ఇవే మాటలు కాదుగానీ... ఈ అర్థం వచ్చేటట్లు మాట్లాడి.

అదే పెద్దవరం అన్నట్లు నా చేయి పట్టుకుని ఆప్యాయంగా నొక్కి, మెట్లు దిగి వెళ్ళిపోయాడు రవీంద్ర. మరికాస్సేపట్లో స్కూటర్ స్టార్ట్ చేసిన శబ్దం, పరచుకున్న ఆ తదియనాటి వెన్నెల రాత్రికి అద్దిన నల్లని అంచులా సాగిపోయింది.

❀❀ ❀❀ ❀❀

రవీంద్ర నా శ్రేయోభిలాషి. అంతకన్నా అతని గురించి ఏంచెప్పినా, అది నా గురించి చెప్పుకున్నట్లే అవుతుంది. మొదటిసారి నగరానికి వచ్చినప్పుడు ఆదివారం ఆబిడ్స్ ఫుట్‌పాత్‌లమీద పరచుకున్న పుస్తకాల మధ్య కలిశాడు. అలా మొదలైన మా పరిచయం ఊడలు దిగి అనతి కాలంలోనే దృఢపడింది. అది కేవలం అతని చొరవే అంటే సబబుగా వుంటుంది.

❀❀ ❀❀ ❀❀

అనుకున్నవి అనుకున్నట్లుగా జరిగితే ఇంక మనకర్థంకాని అదృశ్యశక్తి ప్రసక్తి ఏముంటుంది.

నిజానికి నేనూ, రవీంద్రా కలిసే వెళ్ళాలి అక్కడకు. కానీ... అనుకోకుండా రవీంద్ర ఆఫీసు పనిమీద మద్రాసు వెళ్ళాల్సి రావడంతో నాకు ఎన్నో జాగ్రత్తలు చెప్పి అక్కడకు కూడా నేను వస్తున్నట్లుగా తెలియజేసినట్లు నాకు చెప్పి వెళ్ళాడు.

వొంటరిగానే ప్రయాణమయినా, అంతా రవీంద్ర చెప్పినట్లుగానే ఆ ఊళ్ళో ఎవరినీ అడగనవసరం లేకుండానే, ఆ ఇల్లు గుర్తుపట్టగలిగాను.

ఆ లోగిలంతా వివిధరకాల పూల మొక్కలతో నిండివుంది. రెండు మూడుచోట్ల శిథిలమైన ప్రహరీగోడ మీద మొలచిన తుమ్మ చెట్లు, మరోచోట గోడలోంచి పెరిగిన రావిమొక్కా, పల్లేరు మొక్కలు, గెడకర్రకు కట్టిన తడికల గేటు, ఆ చివరగా రెండు గదుల పెంకుటిల్లు. కుటీరంలా అనిపించింది. గుమ్మానికెదురుగా తులసికోట, అప్పుడే పూజ అయినట్లుంది. అగరుపొగ తులసి ఆకుల్లోంచి తీగలు సాగి, గాలిలో కలిసిపోతూంది.



లక్ష్మీనారాయణ

నన్ను గమనించిన ఆ పెద్ద కళ్ళల్లో ముసురుకున్న ప్రశ్నయవనికలు.

తడబడుతూ 'రవీంద్ర' అన్నాను.

చప్పున కనుమరుగైన శబ్దం.

వరండాలో వాల్చివున్న కుర్చీలో సంశయిస్తూనే కూర్చున్నాను.

అగమ్యగోచరంగా, ఎటూ పాలుపోని సందిగ్ధావస్థలో వున్న నా మనస్సు... అక్కడ వసంతను (రవీంద్ర ముందుగానే చెప్పాడు ఆమె పేరు) చూడగానే గొప్పగా సేదతీరినట్లు అనిపించింది.

నేలమీద పాకేపురుగుల కోసం వాలిన పిచ్చుకల అలికిడికి, ఆలోచనల్లోంచి వెలుపలికి వచ్చి చుట్టూ పరికించి చూశాను.

లోపలి నుంచి శబ్దాలు వినవస్తున్నాయి. కాఫీ వాసన సన్నగా గాలిలోంచి తేలివస్తోంది. రవీంద్ర కూడా వుంటే బాగుండేది, ఏదైనా మొదలుపెట్టేంతవరకే... ఆపై ముడివిప్పిన ప్రవాహమే.... అనుకున్నాను.

"రవీంద్ర వచ్చి మిగతా సంగతులు మాట్లాడతాడు" అంటూ బయటకు వచ్చాను.

వసంతతో మాట్లాడిన తర్వాత అందాకా అనేకానేక సందేహాలతో కళవళపడిన మనస్సుతేలికపడినట్లయింది... ఇంతలో నాలుగైదు సంవత్సరాల పాప "అమ్మా" అంటూ రివ్వున లోనికి వస్తూ నన్ను చూసి ఆగిపోయింది.

ఆ పాప కేసిచూశాను.

'నీపేరిమిటమ్మా' అనడిగాను అనాలోచితంగానే!

"కల్యాణి" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

రోడ్డు మీదకు వచ్చి టైంచూశాను. పదకొండు అవుతోంది. అంటే దాదాపు యాభై నిముషాలు అయివుంటుందనిపించింది. ఎప్పుడూ ఏదీ ఆశించని నా మనస్సు ఇప్పుడు భయపడుతోంది. ఏ కారణం చేతనైనా ఈ 'తొలిఆశ' వమ్ము అవుతుందేమోనని.

❀❀ ❀❀ ❀❀

నా ఆలోచన రూపుదిద్దుకుంటే అచ్చం కల్యాణిలా వుంటుందేమో అనిపించింది. అక్కణ్ణించి వచ్చేస్తుంటే, ప్రస్తుతానికి నాది అత్యాశ అనిపించినా, ఆ పాప భవిష్యత్తు మీద నమ్మకంతోనూ, రవీంద్ర మీద నాకున్న అభిమానంతోనూ అడుగు ముందుకువేశాను.

రవీంద్ర ఆఫీసు పనివత్తిడిలో నేను అక్కణ్ణించి వచ్చిన తర్వాత రెండు, మూడు వారాల వరకూ కలుసుకోవడం కుదరలేదు.

❀❀ ❀❀ ❀❀

"ఇంట్లోనే వుండు వస్తున్నాను' అంటూ ఆ ఉదయం ఫోన్ చేశాడు రవీంద్ర.

తనక్కావలసింది నా కళ్ళు చెప్పాయో ఏమో నన్ను ఏం ప్రశ్నించలేదు. నిజానికి రవీంద్ర ఏంజరిగిందీ అని అడగాలనీ, నేనంతా పూసగుచ్చినట్లు చెప్పాలనీ, నా తాపత్రయం.

మరి రవీంద్ర ఏమీ అడగకుండానే స్థిమితంగా కూర్చున్నాడు.

నాలో ఉక్రోషం ఎక్కువవుతోంది. రవీంద్ర ఆ సంగతి ఏమీ అడగనందుకు, ముక్కుపుటాలు అదురుతున్నాయి అసహనంతో, చెవుల్లోంచి హోరు వినవస్తోంది.

మెల్లగా లేచివచ్చి రవీంద్ర నా భుజంమీద చేయి వేశాడు ఆత్మీయంగా, ఆ స్పర్శ ఎన్నో విషయాలను తెలిపింది మౌనంగా. మా ఇద్దరి కళ్ళల్లోనూ ఏదో సంతృప్తిని కలిగించింది. అర్థమైంది విషయం. ఆర్ద్రమయ్యాయి మా మనస్సులు. సౌహార్ద్రమైంది మా కలయిక.

"ఇంకెంత వారంరోజులు" అన్నాడు రవీంద్ర చిన్నగా నాకు మాత్రమే వినబడేలా.

❀❀ ❀❀ ❀❀

కొత్త హోదా, కొంగ్రొత్త బాధ్యతలు, ఏదో ఉద్వేగం, ఇది... ఇది... వాస్తవం కాదేమోనని, వాళ్ళిద్దరినీ తేరిపార చూసుకోవడం, కళ్ళుమూసి తెరిస్తే... కల... కరిగిపోతుందేమోనన్న భయం... మరో పద్దెనిమిది గంటల్లో నేనూ, వసంత, కల్యాణి తిరుమల కొండమీద వున్నాం. ముందు కల్యాణిని మాకూడా తీసుకువెళ్ళవద్దన్నాడు రవీంద్ర. కానీ, నేను నచ్చచెప్పడంతో సరే అనక తప్పలేదు రవీంద్రకు.

కల్యాణి కూడా బాగా చేరువయింది నాకు. ఇది ఇంకెన్ని సమస్యల మలుపు తిప్పుతుందోనన్న సందిగ్ధంతోనే దాదాపు ఈ సంవత్సరకాలమంతా తొందరగా గడిచిపోయింది.

"ఆత్మవిశ్వాసం లేనంతవరకూ ఏ పనినీ ప్రారంభించకు, ఇతరులకు నీపైన నమ్మకం లేనంత మాత్రాన ఏ పనినీ విడిచిపెట్టకు"

కల్యాణిని నగరంలోని పెద్ద హాస్పటల్‌లో జాయిన్ చేయడమూ, విజయవంతంగా ఆపరేషన్ అయ్యేంత వరకూ కూడా విపరీతమైన టెన్షన్‌తో అటు వసంతా, ఇటు నేనూ, రవీంద్రా కూడా నలిగిపోయాము.

"ప్రాథమిక దశలోనే కల్యాణి గుండె కవాటానికి ఏర్పడుతున్న సమస్యను టెస్టుల ద్వారా కనుగొనడం వలన...తొందరగా నయం చేయగలిగాం" అన్నారు కల్యాణిని డిశ్చార్జి చేస్తుంటే డాక్టరుగారు.

కల్యాణిని అక్కున చేర్చుకుని కూర్చున్న వసంత కళ్ళల్లో ఇన్నాళ్ళకు వెలుగు చూశాను.

నన్ను చూడగానే కల్యాణి చేతులు చాచి నవ్వుతూ వచ్చింది. నేను తెచ్చిన బొమ్మలు, బట్టలూ తీసుకుని మురిసిపోతూ వాటిని వసంతకు చూపి నవ్వుతోంది. వాయులీనం మీద గులాబీ రేకలు రాలుతున్నంత సహజంగా.

అతిగా దేనికీ స్పందించకూడదనీ తెలుసు, దేనినీ ఆశించి భంగపడకూడదనీ తెలుసు. కానీ ఎక్కడో బలహీనత... ఆ బలహీనత నాలో పిరికితనాన్ని తాళప్రమాణంగా పెంచి పోషించింది. అది... అది... నన్ను మానసికంగా నిర్వీర్యుణ్ణి చేస్తోంది. యస్... నాకు ముందే తెలుసు... ఈ బంధాలూ, బాధ్యతలన్నీ కేవలం ఒక మంచి పనికోసమని, కనీసం కల్యాణి జీవితమన్నా బాగుపడుతుందన్న ఆశ. ఇప్పుడు ఆ ఆశే బంధమై ఆ బలహీనతకు లొంగిన నా మనస్సు వెనుకటి కరకుతనాన్ని సంతరించుకోవడానికి సుతరామూ అంగీకరించడం లేదు ప్చ్!

సాయంత్రం గౌతమీకి వసంత, కల్యాణీ వెళ్ళిపోతారనే విషయం నాకూ, వసంతకూ తెలుసు. రవీంద్ర బెంగుళూరు వెళ్ళాడు.

విధి విచిత్రం సంవత్సరం క్రితం వరకూ వీళ్ళందరూ ఎవరు? వసంత చాలా తక్కువగా మాట్లాడుతుంది. అది కూడా కేవలం చాలా సహజంగా అన్నట్లు కళ్ళతోటే. నేనది కేవలం నిర్లిప్తత ఏమో అనుకున్నాను. ఎందుకంటే కల్యాణి జీవితం బాగుపడుతుందనే ఉద్దేశంతో మాత్రమే వసంత రవీంద్ర చెప్పినదానికి అంగీకరించి వుంటుందని నాకు ప్రగాఢంగా అనిపించింది. అందులో- నిజానికి నాకు అప్పుడూ.... ఇప్పుడూ కూడా ఏం తప్పు కనపడలేదు. నిజానికి ఆ తల్లిపడే ఆవేదనకు స్పందించని హృదయం వుంటుందా అనిపించింది. కానీ... ఎక్కడో అసంతృప్తి... కొత్త బంధాలూ... బాధ్యతల్లోంచి వచ్చిన స్వార్థమా... అనిపించేది. ఎప్పుడో... ఎక్కడో... గుండె గూడుల్లోంచి పీలగా ఏదో గొంతు...అది పిలుపా... మూలుగా... లేదా కేవలం నా భ్రమేనా... లేదా... అసహాయతలోంచి వినవచ్చే ఆక్రందనా... ఏదీ నిర్ణయించుకోలేని స్థితిలో వినిపించే గానం... ఆశలా... ఆలంబనగా అల్లుకున్న లతలేవో గాలిలో నాట్యం చేస్తున్నట్లనుభూతి. రాలిపడే పువ్వుల కంటని నిర్లిప్తత... అప్పుడు వినిపిస్తుంది. అడుగుల సవ్వడి... అది విని ప్రతిస్పందించే మనసు బేలగా... ఆర్తిగా....!

"ప్రాథమిక దశలోనే కల్యాణి గుండె కవాటానికి ఏర్పడుతున్న సమస్యను టెస్టుల ద్వారా కనుగొనడం వలన... తొందరగా నయం చేయగలిగాం" అన్నారు కల్యాణిని డిశ్చార్జి చేస్తుంటే డాక్టరుగారు.
కల్యాణిని అక్కున చేర్చుకుని కూర్చున్న వసంత కళ్ళల్లో ఇన్నాళ్ళకు వెలుగు చూశాను.

❀❀ ❀❀ ❀❀

"విన్నది నిజమేనా?" రవీంద్ర వచ్చాడు. ఆ గొంతులో వినిపించే దెబ్బతిన్న పక్షి రోదన. సోఫా మధ్యలో కూర్చున్న నేను మాట్లాడలేదు. కానీ, కనులు పైకెత్తి చూశాను రవీంద్రకేసి అందులో అంత ఆశ్చర్యపడాల్సిందీ, బాధపడాల్సిందీ ఏముందా అన్నట్లుగా.

"అదికాదు చందూ" ఏదో చెప్పబోయాడు రవీంద్ర.

ఇంతలో రమణ బృందం వచ్చింది. నిజానికి రవీంద్రకంటే ముందునించే వాళ్ళందరూ నాకు ఆప్తులు, ఆత్మీయులూను. అందరి మనస్సుల్లోనూ ఒకటే ప్రశ్న-

"విన్నది నిజమేనా?"

అక్కడున్న వాళ్ళందరికి మనస్సులు చదివినట్లుగా, రవీంద్ర చిన్నగా దగ్గి "వసంత ప్రమాదంలో మరణించిన నా స్నేహితుని భార్య, మధ్యతరగతి సంసారం కావడంతో భర్త మరణం అనంతరం వసంత దాదాపు ఒంటరి అయిపోయింది. పైగా గుండె కవాటానికి చిల్లుపడి బాధపడుతున్న కూతురు కల్యాణిని బతికించుకోవడం కోసం, నా మాటమీద వసంత చందూ భార్య, కల్యాణి అతని కూతురూ అయ్యారు" అని ఒకసారి అందరికేసి పరిశీలనా చూసి,

"కల్యాణికి కావలసిన వైద్య సహాయమూ, ఆపరేషన్‌కు అవసరమయ్యే ఖర్చులను ఎవరూ భరించలేరు. అందుకని ఎంతో ఆలోచించిన మీదట వసంత చందూ భార్య అయింది. ఆవిధంగా కల్యాణి గుండె ఆపరేషన్‌కయ్యే ఖర్చును భరించడం వీలవుతుందనీ, తద్వారా కల్యాణి జీవితం కుదుటపడుతుందనీ, అందుకవసరమయ్యే మార్పులు, చందూ తన ఆఫీసు కాయితాల్లో చేయడం వల్ల ఖర్చు అంతా మెడికల్ ఇన్సూరెన్స్ వాళ్ళు భరించడంతోనూ, కల్యాణి గుండె ఆపరేషన్ విజయవంతమయిన తర్వాత మేం ముందే అనుకున్నవిధంగా వసంత, కల్యాణి వాళ్ళ ఊరు వెళ్ళిపోయారు" అన్నాడు రవీంద్ర భారమైన గొంతుతో.

నేను మౌనంగా చూస్తున్నాను. గుండెను ఎవరో రెండరచేతుల మధ్య పట్టుకుని నొక్కి వేస్తున్నట్లు, ఊపిరి ఆగిపోతుందేమోనన్నట్లుగా బరువుగా నిశ్వసిస్తున్నాను.

"ఇందులో చందూ పొరపాటు ఏమీలేదు" అంటూ రవీంద్ర "ఏమైనా తప్పుంటే అది నాదవుతుంది. నేను కేవలం చందూ మిత్రుణ్ణేకాదు, వసంత భర్త చలపతి తండ్రీ, మా నాన్న స్నేహితులు కూడా. అంతేకాకుండా అటు వసంత, ఇటు చందూ, కల్యాణికి తల్లిదండ్రులవుతారని కూడా ఆశపడ్డాను" అని ఆగాడు రవీంద్ర నిట్టూరుస్తూ...

రమణ తదితర మిత్రులందరూ మౌనంగా వున్నారు. వాళ్ళ కళ్ళల్లో అనవసరంగా చందూని అనుమానించి, అవమానించామనే గిల్టీ ఫీలింగ్. సన్నటి తెరలా కప్పేసింది.

ఏమనాలో తెలీక మౌనంగా వున్నాను. ఇంతలో గుమ్మం దగ్గర ఆటో ఆగిన సవ్వడికి అంతా అటు చూశారు. ఒక్కసారిగా కాలం ఆగినట్లనిపించింది నాకు. కల్యాణి... అవును... నా చిన్ని కల్యాణి... రివ్వున దూసుకువచ్చి 'నాన్నా' అంటూ నా చేతుల్లో వాలిపోయింది.

వెనగ్గా వసంత... అప్పుడు చూశాను ఆ కళ్ళల్లో కనిపించే సంశయం. తలొంచుకుని కుడికాలి బొటనవేలు నేలను రాస్తోంది.

"కల్యాణి జ్వరంలో మిమ్మల్ని పదేపదే తలుస్తూ కలవరిస్తోంటే... డాక్టరుగారు కూడా..." అని ఆగిపోయింది గొంతులో ఏదో అడ్డు పడినట్లు వసంత.

అప్పుడనిపించింది.... ఎక్కడో... గుండె గూడుల్లోంచి అసహాయత్వంలోంచి వినిపించేది ఆక్రందన కాదు. అది... మూలుగూకాదు... కానీ..

అది అది గొంతు దాటని పిలుపే. అది కేవలం వసంతగానమే... మౌనంగా...!!!